క్లుప్తంగా

కార్మికులకు చీరల పంపిణీ



కందుకూరు: మండల పరిధిలోని కందుకూరు, కొత్తగూడ గ్రామ పంచాయతీ కార్మికులకు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తన సొంత నిధులతో ప్రతి ఏడాది మాదిరే దసరా పండుగను పురస్కరించుకుని చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గిరిజనులు

కందుకూరు: మండల పరిధిలోని మాన్యగూడ తండాలో బుధవారం గిరిజనులు తమ ఆరాధ్యదైవం శ్రీ సేవాలాల్ మహరాజ్ మరియు శ్రీ మేరమయ్యాడి ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గిరిజనులు పెద్దఎత్తున చేరుకుని గిరిజన సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే ఏడాదికి గుడి నిర్మాణం పూర్తిచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీసేవాలాల్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు నరేష్, కార్యదర్శి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి రమేష్, సలహాదారులు కల్యాణ్, యూత్ సభ్యులు శ్రీకాంత్, శ్రీను, కుమార్, కృష్ణ, శ్రీను, సామ్య, శంకర్, శ్రీను, రాజు, పంతుల, దేవేందర్, బాలు, గణేష్, చరణ్, భాస్కర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా కమిటీ చైర్మన్‌గా రాజుగుప్తా



రాజును సత్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల ఆర్య వైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాజుగుప్తాను మంత్రి సబితారెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ బాధ్యతలు తీసుకున్నా అంకితభావంతో పనిచేయాలని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, నాయకులు నగేష్, శేఖర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

మేయర్ పారిజాత

బడంగ్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కృష్ణారెడ్డిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విష్ణు సహస్ర పారాయణం, హవనం, గరుడ వాహన సేవ కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ ముఖద్వారాన్ని నిర్మించిన గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణారెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్ వాల్మీకి, 11వ డివిజన్ కార్పొరేటర్ సుక్క శివకుమార్, పాలకమండలి సభ్యులు పద్మ శంకర్ గౌడ్, కృష్ణ నాయి,సద్ది సహదేవ్, అశోక్ ముదిరాజ్‌లు ఆయనకు స్వామివారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

తలకొండపల్లి: ఆరోగ్య భారత్ దిశగా కేంద్రం ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు తిర్మనీ రవిగౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ విజయం ఖాయమన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. రవిగౌడ్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌తో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అనిల్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కుమార్, సత్యం, శ్రీశైలం, శ్రీను, గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: అన్నపూర్ణాదేవి హోమం చేస్తున్న భక్తులు



మీర్‌పేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



హుడాకాంప్లెక్స్: రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శరన్నవరాత్రి సంబురాలు

- భక్తులతో ఆలయాలు కిటకిట
- అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సాయి కెమికల్ కంపెనీకి చెందిన టిప్పిరెడ్డి అనిత–మధుసూదన్‌రెడ్డి దంపతులు అన్నపూర్ణాదేవి హోమం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సూర్జగంటి ఆనందం, మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్ యాదవ్, డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, రవీందర్, బాల్‌రాజ్, వెంకటేశ్, మహేందర్, ఆలయ మాజీ చైర్మన్లు నవీన్, కుమార్, మాజీ ఉపసర్పంచులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ పూజారులు వీరేశం, రాజు, జగదీశ్, చెన్నాబస్వ,రవికాంత్, సాయి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాంకాలనీలో మాతా జాగరణ..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి యంగ్ ఇండియన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాగరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ..

మీర్‌పేట: మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో కళాశాలలో బతుకమ్మ ఆడారు. వేడుకలో ప్రిన్సిపాల్ సైదులు, లెక్చరర్లు అనూరాధ, దుర్గ, సవితాశర్మ, నర్సింహాచారి, టీజీ వెంకటేశ్వర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరిద్దాం



తుక్కుగూడ: మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

- మంత్రి సబితాఇంద్రారెడ్డి
- బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం

తుక్కుగూడ: మహేశ్వరం అభివృద్ధి కోసం మరోమారు నన్ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా తుక్కుగూడ, బాసగూడకు చెందిన పలువురు యువకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తుక్కుగూడలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడే లక్ష్మయ్యయాదవ్, వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, లావణ్య, సుమన్, తేజస్విని, నాయకులు రాజు, శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రాజిరెడ్డి, పద్మ, బుచ్చిరెడ్డి, రాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పహాడీషరీఫ్: జల్‌పల్లికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 40 రజక కుటుంబాలు బుధవారం మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సూరెడ్డి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో వీరికి మంత్రి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జనార్దన్, సీనియర్ నాయకులు సయ్యద్ పటేల్, నగేష్, జంగయ్య పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతమొందిద్దాం



తుక్కుగూడ: అందెల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

- బీజేపీ నేత అందెల

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలకు 45 రోజులు కష్టపడి పని చేయండి.. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే నన్నారు. బీజేపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో గోవర్ధన్, రవీందర్, ప్రకాష్, భాస్కర్‌గౌడ్, మల్లేష్, నవీన్, రమేష్, వంశీ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వినాయకహిల్స్ కాలనీలో..

బడంగ్‌పేట్: బీజేపీ మహేశ్వరం నియోజకర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ బుధవారం చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని వినాయకహిల్స్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో భేటీ నిర్వహించి బీజేపీకి ఓటువేయాలని అభ్యర్థించారు.

గృహిణి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ నసీబ్‌నగర్‌కు చెందిన నిలోఫర్ బేగం (34), మీర్ దస్తగిరి అలీ దంపతులు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భర్త ఇంట్లో లేని సమయంలో నిలోఫర్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులకు దసరా బొనాంజా

ఆర్టీసీ బస్టాండ్లలో లక్కీడ్రా బాక్సుల ఏర్పాటు

హయత్‌నగర్: దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని టీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా ద్వారా బహుమతులను అందిస్తున్నట్లు హయత్‌నగర్-1 డిపో మేనేజర్ జలగం విజయ్ తెలిపారు. బుధవారం ఆయన హయత్‌నగర్ బస్‌స్టేషన్‌లో లక్కీ డ్రా బాక్సును ప్రా రంభించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ...ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆర్టీ సీ పలు పథకాలను అమలు చేస్తుందన్నా రు. ఇందులో భాగంగా ప్రతీ రీజియన్ పరిధిలో బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు రోజుకు పది మంది పురుషులు, పదిమంది మహిళలకు.. ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున మొత్తం 110 మందికి రూ.11 లక్షలు బహుమతులుగా అందజేస్తామని తెలిపారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక ఫోన్ నంబర్‌ను రాసి స్త్రీ, పురుషులకు వేరు వేరుగా కేటాయించిన డ్రా బాక్సుల్లో వేయాలని సూచించారు.

కిషన్‌రెడ్డిని గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి

- నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి
- ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ నేతలకు దిశానిర్దేశం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని బుధవారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను కాకుండా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి చక్కటి ప్రణాళికతో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలన్నారు. పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కేవలం ఈ నాలుగేళ్లలో జరిగిందన్నారు. కలెక్టరేట్, ఆర్డీఓ, డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఈ నియోజకవర్గానికే తెచ్చుకున్నామన్నారు. 100 పడకల ఆస్పత్రి, సమీకృత వెజ్,నాన్‌వెజ్, కూరగాయల మార్కెట్లు, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవన నిర్మాణాలు, డబుల్, ఫోర్‌లైన్ రోడ్ల నిర్మాణాలు చేసామన్నారు. స్థానికంగానే ఉంటూ సేవచేస్తున్న తనను ప్రజలు నాలుగోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అల్వాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహించండి..

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...టీఎస్ఐపీసీ నిధులతో గ్రామాల్లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించామని అన్నారు. గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్చ భాషా, నక్కర్తమేడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శివలీల, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుక్కుగూడ: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్ఓ) సూరజ్‌కుమార్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 21 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఏఈ భార్గవ్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- యాదవ్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: బీఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాగోల్ డివిజన్‌లో యాదవ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పాడి పరిశ్రమల్లో భాగంగా అర్హులకు పశువులు అందేలా చూస్తామని, పశువుల ఆసుపత్రి కూడా ఏర్పాటు చేయిస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని అర్హులకు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. యాదవ సంఘం సభ్యులకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని, తనను ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా దీవించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్, సుర్వి రాజు గౌడ్, యాదవ సంఘం ప్రతినిధులు సతీష్ యాదవ్, కిరణ్ యాదవ్, కిషన్ యాదవ్, వెంకటేష్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

'యుద్ధభేరి'ని విజయవంతం చేద్దాం

- ఎల్‌బీనగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉపేందర్

హుడాకాంప్లెక్స్: ఇందిరాపార్కు వద్ద నవంబరు 5న జరిగే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పంతం ఉపేందర్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీను ఆదేశాల మేరకు బుధవారం చైతన్యపురి డివిజన్ నుంచి ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు బిల్లు పెట్టలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వర్గీకరణకు సహకరించటం లేదన్నారు. మాదిగ జాతిని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహ, జాతీయ మహిళా అధ్యక్షురాలు రుక్కమ్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుగుణమ్మ, ఏసోబు, జయన్న, ఎల్లయ్య, లక్ష్మయ్య, జగదీశ్, నాగరాజు, సైదులు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్యవస్థ మార్పునకు ఓటు నాంది

- దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థులతో 'సాక్షి' ఇష్టాగోష్టి
- అన్ని వర్గాలను సమదృష్టితో చూడాలి
- రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలి



సాక్షి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థుల ఇష్టాగోష్టి

చైతన్యపురి: గ్రామం.. నియోజకవర్గం...రాష్ట్రం.. దేనికైనా సమర్థుడైన నాయకుడ్ని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధించటమే కాక బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయగలం. ప్రజాస్వామిక దేశంలో కుల, మత, లింగ, వర్గ, ప్రాంత బేధం లేకుండా ఓటును వినియోగించుకునే హక్కు ఉంది. అసెంబ్లీ ఎనికల్లో సమర్థవంతమైన నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై నేటి యువత అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్య అకాడమీలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ' ప్రజా ఎజెండా' పేరుతో విద్యార్థులతో చర్చాగోష్టి జరిగింది. వ్యవస్థ మార్పుకు ఓటు నాంది కావాలని, సొంత లాభం మానుకుని సరైన నాయకుడికి ఓటు వేయాలని పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

◆ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఓటు హక్కును వినియోగించాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత లేకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరేలా చూసుకోవాలన్నారు.

◆ కుల, మత ప్రాతిపదికన కాకుండా అందరికీ సమ న్యాయం చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని, అన్ని వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య కల్పించి, పోటీ పరీక్షలకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, రిజర్వేషన్లతో కాకుండా మెరిట్ ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించాలని ఇష్టాగోష్టిలో విద్యార్థులు పేర్కొన్నారు.

ప్రజల బాగోగులు చూసే వారిని గెలిపించాలి



స్థానికంగా ఉండే సమస్యలను గుర్తించి పరిష్కరించి ప్రజల బాగోగులు చేసేవారిని గెలిపించాలి. కుల, మత. ప్రాంత ప్రాతిపదికన కాకుండా సమర్థుడైన నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి. కులాల పేరుతో కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారందరికి రిజర్వేషన్లు కల్పించాలి. డబ్బులు తీసుకుని ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– సౌమిక రెడ్డి, స్టూడెంట్

మంచి నాయకులను ఎన్నుకోవాలి



రాష్ట్రమైనా, నియోజకవర్గం అయినా అభివృద్ధి చెందాలంటే ఓటు రాజకీయాలు పోవాలి. వ్యవస్థ మార్పుకు ఓటు నాంది కావాలనే ఆలోచన సమాజంలో రావాలి. డబ్బులు తీసుకుని ఓటు వేస్తే ప్రజలకు నష్టం జరుగుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించే వారికి ఓటు వేయాలి. యువత చదువుకొనేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– జగదీష్‌రెడ్డి, విద్యార్థి

అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి



ఇంజినీరింగ్, వైద్య విద్య కాకుండా అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు చొరవ చూపాలి. ప్రస్తుతం ఉన్న విద్యా విధానాన్ని మార్చాలి. నిస్పక్షపాతంగా అన్ని సెక్టార్ల వైపు యువతను ప్రోత్సహించాలి. మెరిట్ ప్రకారం ఉద్యోగాలు కల్పించాలి. ఓటును ఆయుధంగా మార్చుకుని ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి చేసే వ్యక్తికి ఓటు వేసి గెలిపించుకోవాలి.

– దేవిశ్రీ, విద్యార్థిని